సమగ్ర సర్వేలో వివరాలు ఇచ్చిన హెచ్ఎండీఏ కమిషనర్

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న హెచ్ఎండీ కమిషనర్, సమగ్రసర్వే ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ తమ కుటుంబ వివరాలు ఎన్యూమరేటర్లకు అందజేశారు. సర్వే జరుగుతున్న తీరును గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్యూమరేటర్ పృథ్వీ, సూపర్‌వైజర్ శివకుమార్ పాల్గొన్నారు.
– బంజారాహిల్స్,నవంబర్ 15

రేపు అయ్యప్ప స్వామి
మహా పడిపూజ

మణికొండ, నవంబర్ 15: ఈ నెల 17న అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు మణికొండ అయ్యప్ప స్వామి సన్నిదానం స్వాములు తెలిపారు. మణికొండ శివాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు మున్ననాయుడు గురుస్వామి, రాజేందర్‌గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ మహా పడిపూజ మహోత్సవం జరుగుతుందన్నారు. జడల రమేష్ గురుస్వామి నేతృత్వంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్నదాన ప్రభువుగా కె.భాస్కర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. భక్తులు, అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున ఈ మహాపడి పూజలో పాల్గొనాలని కోరారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 15: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) (సీబీసీఎస్) మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లమెంటరీ, బీఈ (నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలతో పాటు డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల రివాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓటరు నమోదుకు ముందస్తు అవకాశం

- డిసెంబర్ 31 నాటికి 18 ఏండ్లు నిండనున్న వారికి అడ్వాన్స్ ఆఫర్..
- కొత్త ఓటర్లకు ఏడాదికి నాలుగుసార్లు అర్హత..
- ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు ఈ నెల 28 వరకు అవకాశం
- 2025 జనవరి 5 న ఫైనల్ జాబితా

జూబ్లీహిల్స్,నవంబర్ 15 : అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఎన్నికల సంఘం ఇటీవల ఓటరు నమోదుకు ఏడాదికి నాలుగు అర్హత తేదీలు అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 వ తేదీలలో 18 ఏండ్లు నిండిన వారు నిరంతర ప్రక్రియగా సాగే ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. కాగా తాజాగా 2025 జనవరి 1నాటికి 18 ఏండ్లు నిండనున్న యువత ముందుగానే ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఓటరు సవరణలకు నవంబర్ 9,10 తేదీలలో పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించిన అధికారులు డిసెంబర్ 31 నాటికి 18 ఏండ్లు పూర్తిచేసుకోనున్న యువతీ యువకులను ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆఫ్‌లైన్‌లో నవంబర్ 28 వరకు ప్రత్యక్ష ఓటరు నమోదు, సవరణలు చేపడుతున్నారు. కాగా వచ్చే ఏడాదికి నూతన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు ఆన్‌లైన్‌లో డిసెంబర్ నెలాఖరు వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నూతన ఓటర్ల నమోదు, సవరణలతో విడుదల చేసే ఫైనల్ జాబితాను 2025 జనవరి–5న విడుదల చేయనున్నారు.

కొత్త ఓటరుగా నమోదు చేసుకుంటున్న యువకులు

జూబ్లీహిల్స్‌లో పెరుగనున్న ఓటర్లు..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం 3,89,272 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,02,885 మంది, మహిళలు 1,86,387 మంది, ఇతరులు 22 మంది ఉన్నారు. కాగా అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అధికారులు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం–2025 చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని 329 పోలింగ్ బూత్‌లలో రెండు రోజులపాటు ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టిన అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2025 జనవరి–1 వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండనున్న యువతీ యువకులకు ముందస్తుగా తమ ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీంతో జూబ్లీహిల్స్ ఓటర్లు 3.90 లక్షలకు చేరే అవకాశాలున్నాయి.

మొబైల్ యాప్‌లో
ఓటర్ హెల్ప్‌లైన్

నూతన ఓటరు నమోదుకు, సవరణలకు మొబైల్ యాప్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుంది. ఓటరు నమోదుకు ఫారం–6, ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఫార–7, సవరణలకు ఫారం–8 లను జీహెచ్ ఎంసీ అధికారులకు అందజేయవచ్చు. అర్హత తేదీ నాటికి 17 ఏండ్లు నిండిన వారు ఏడాది ముందుగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 28 వరకు కొనసాగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని యువతీ యువకులు ఓటు హక్కు పొందాలి.
– జకియా సుల్తానా, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జూబ్లీహిల్స్

మారుతీ కార్లు...మైలేజీలో బెస్ట్

ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు

సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): మారుతీ కార్లకు అన్ని వర్గాల ప్రజల ఆదరణ ఉంటుందని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు అన్నారు. శుక్రవారం అత్తాపూర్‌లోని ఆదర్శ మోటార్స్ షోరూమ్‌లో సరికొత్త మారూతి స్విఫ్ట్ డిజైర్ కారును ఆదర్శ ఆటోమోటివ్ ఎండీ బూరుగు విజయ్ గౌడ్‌తో కలిసి ఆయన మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లం రాజు మాట్లాడుతూ మారుతి కార్లు బెస్ట్ మెయింటనెన్స్ ఫ్రీ కార్లని, ఇవి మైలేజ్ కూడా అధికంగా ఇస్తాయన్నారు. ఆదర్శ ఆటోమోటివ్ ఎండీ విజయ్ మాట్లాడుతూ కొత్త స్విఫ్ట్ డిజైర్ కారులో 6 ఎయిర్‌బ్యాగ్స్ స్టాండర్డ్‌గా అందిస్తున్నారని, మానువల్ ట్రాన్స్‌మిషన్‌లో మైలేజ్ 24.79 కేఎంపీఎల్, సీఎన్‌జీలో 33.73 కేఎంపీఎల్, ఏజీఎస్‌లో 25.71 కేఎంపీఎల్‌గా ఉన్నట్లు వివరించారు. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.6.79లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఆటోమేటివ్స్ సీఈఓ నలినీకాంత్, జనరల్ మేనేజర్ రవీందర్, షోరూమ్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారం చేసుకోవాలి

హిమాయత్‌నగర్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారం చేసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ బైక్ దుకాణ దారులకు సూచించారు.తమ షాపుల ముందు బైక్‌లను నిలిపితే ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేస్తున్నారని సెకండ్ హ్యాండ్ బైక్‌ల షాపు యజమానులు దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లారు.
శుక్రవారం కింగ్‌కోఠిలోని బైక్స్ మార్కెట్‌లో పర్యటించి బైక్ దుకాణ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలపడం వల్ల పాదచారులకు,ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని అందుకోసమే చలాన్లు వేస్తున్నట్లు నారాయణగూడ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఎమ్మెల్యేకు వివరించారు.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహకంగా...

దేశ నలుమూలలోని మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో హోటల్ తాజ్‌కృష్ణలో ఆధునిక, సంప్రదాయ మేళవింపుతో ఏర్పాటు చేసిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం టాలీవుడ్ నటి హిమజ, వారాహీ సిల్క్స్ ఎండీ డాక్టర్ స్పందనతో కలిసి ప్రారంభించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన చేనేత, చేతివృత్తులతో పాటు వివాహాది, భారతీయ సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నాయని నిరాహకుడు ఉమేశ్ తెలిపారు.
– ఖైరతాబాద్, నవంబర్ 15

స్వాములకు నిత్య అన్నదానం ప్రారంభం

దైవభక్తి, సేవాగుణాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్‌లో ముద్దగౌనీ భాస్కర్‌గౌడ్, ముద్దగౌనీ మల్లికార్జున్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. –మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 15

సీఎం సహాయనిధి పేదలకు వరం

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ, నవంబర్ 15: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు శుక్రవారం చెక్కులను పంపిణీ చేశారు. మణికొండకు చెందిన రామకృష్ణకు రూ.44 వేలు, చిత్రపురికి చెందిన రాంమోహన్‌కు రూ.44 వేలు మంజూరు కావడంతో వారికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరగా వారి వైద్య ఖర్చుల కోసం ఈ చెక్కులను అందించారు. రానున్న రోజుల్లో సైతం మరింత మందికి అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబాగ్‌లో.. దంగల్

రాంబాగ్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే తమ జీవితం సుఖంగా సాగుతుందని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కుస్తీ పోటీల కమిటీ చైర్మన్, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నారగూడెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.రాజు పైల్వాన్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కుస్తీ పోటీలలో హైదరాబాద్ నగరం నలుమూలల నుంచి రెజ్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలకు తగిన సమయాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు వై.శ్రీధర్, కొమురయ్య, మల్లేష్‌యాదవ్, విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు మేడం మధుసూదన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎం హరినాథ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఆర్. శరత్ బాబు, కోశాధికారిగా రామరాజు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల స్వామి, పూలమ్మ, సహాయ కార్యదర్శిగా నాగరాజు, సలహాదారులుగా జి. రమేశ్, బి. ఉమేశ్‌లు ఎన్నికయ్యారు. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణలను మర్యాదపూర్వకంగా కలిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వివరించారు. –ఖైరతాబాద్, నవంబర్ 15

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జూబ్లీహిల్స్,నవంబర్15 : విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా శనివారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ పీఈఐఓహెచ్, బీఎస్ఎన్ఎల్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. మాదాపూర్ సబ్ స్టేషన్ దుర్గం చెరువు, ఏపీఐఐసీ–1 ఫీడర్లపరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ హైలం కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు.. ఫిలింనగర్ సబ్‌స్టేషన్ భారతీయ విద్యాభవన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు.. ప్రశాసన్ నగర్ సబ్‌స్టేషన్ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు.. రవీందర్ సొసైటీ సబ్‌స్టేషన్ సీఓడీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ స్టేట్ హోమ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ ఐఓఏ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు.. జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ ఫిలింనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు.. రహేజా సబ్‌స్టేషన్ వెంకటేశ్వర కాలేజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు.. ప్రశాసన్ నగర్ సబ్‌స్టేషన్ ఆరోగ్యశ్రీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుంచి 1 గంట వరకు.. జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ హెచ్‌పీ గ్యాస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. మాదాపూర్ సబ్‌స్టేషన్ ఎన్‌సీసీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

శంషాబాద్ పట్టణంలో..
నేడు శంషాబాద్ పట్టణంలోని వివిధ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌బాషా శుక్రవారం తెలిపారు. ధర్మాసాయి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లతోలగింపుతో పాటు వివిధ సమస్యలను పరిష్కారం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలన్నారు.

సకల సౌభాగ్యాలు కలగాలి

కార్తీక పౌర్ణమి సందర్భంగా పరమ శివుడిని పార్థించిన భక్తులు

బంజారాహిల్స్,నవంబర్ 15: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్,జూబ్లీహిల్స్,వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. తెల్లవారుజామునే కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు ఆలయాలకు పోటెత్తారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయం, శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానంలో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేసి కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఆలయాలు కిటకిట

శంషాబాద్ రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శంషాబాద్ లోని వివిధ ఆలయాలు కిటకిటలాడాయి. శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వర ఆలయం, నర్కూడ గ్రామంలోని అమ్మపల్లి,పెద్దషాపూర్, శివాలయం,పెద్దతూప్ర గ్రామంలోని శివాలయం, పెద్దగోల్కొండ గ్రామంలోని శివాలయంలో ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలతో పాటు కార్తీక దీపాలు వెలిగించి సుఖ సంతోషంగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ శంషాబాద్ సిద్ధుల గుట్ట సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా టీటీడీలో ఉచిత కుంకుమార్చన

హిమాయత్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీ భవన్‌లో వందలాది మంది మహిళలచే ఉచిత సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

శంషాబాద్ సిద్ధుల గుట్ట సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

హిమాయత్‌నగర్‌లోని టీటీడీలో జరిగిన ఉచిత కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బోరబండ స్వరాజ్‌నగర్‌లోని శ్రీహరిహర క్షేత్రంలో..

బంజారాహిల్స్ రోడ్డు నెం 1లోని శివాలయంలో ..

బంజారాహిల్స్‌లోని ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఖైరతాబాద్‌లోని శ్రీ మహాంకాళి దేవాలయంలో..

శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వర ఆలయంలో..

నేడు పలు ప్రాంతాల్లో
విద్యుత్‌కు అంతరాయం

మణికొండ, నవంబర్ 15: మరమ్మతుల కారణంగా పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

బీబీఏ, బీఏ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీబీఏ, బీఏ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ రిటెయిల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఏ అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదేరోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు.